## ఏఈవీఎం గోదాముల వద్ద అప్రమత్తంగా ఉండాలి : కలెక్టర్ విజయకృష్ణన్

**విశాలాంధ్ర-అనకాపల్లి కలెక్టరేట్ :** జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ సోమవారం ఉదయం నెలవారీ తనిఖీ లో భాగంగా జిల్లా ఎస్.పి. కార్యాలయం ప్రాంగణంలో ఉన్న ఈవీఎం గోదాములను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమెతో పాటు అనకాపల్లి ఆర్డీవో షేక్ అయిషా, డిఆర్ఓ వై.సత్యనారాయణరావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. తనిఖీ సమయంలో కలెక్టర్ గోదాముల వద్ద భద్రతా పరిస్థితులను పరిశీలించి, సీసీ కెమెరాల పనితీరును, ప్రధాన ద్వారానికి అమర్చిన సీళ్లను పరిశీలించారు. అనంతరం విజిటింగ్ రిజిస్టర్‌లో సంతకం చేసి, సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అదనంగా భద్రతా ప్రమాణాలపై అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేస్తూ, లాగ్ బుక్ నిర్వహణ మరియు ఇతర అంశాలపై రాజకీయ పార్టీల నేతలతో చర్చించారు. ఈ కార్యక్రమంలో కలక్టరేట్ పరిపాలనాధికారి విజయ్ కుమార్, జిల్లా ఎన్నికల విభాగం సిబ్బంది, తెలుగుదేశం, వైసీపీ, కాంగ్రెస్, ఆప్, సిపిఎం పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## అనధికారికంగా పిల్లలను పెంచుకుంటే నేరం

### బాలల సంరక్షణ సలహాదారు గోషియా భాను

**విశాలాంధ్ర-అనకాపల్లి:** పిల్లలను అనధికారంగా పెంచుకుంటే అది చట్టరీత్యా నేరమని జిల్లా పాలల సంరక్షణ సలహాదారు ఎండి గోషియా భాను అన్నారు. మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి ఎస్. సూర్యలక్ష్మి వారి ఆదేశాల మేరకు జిల్లా బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో మండలంలో మాటూరు-2 అంగన్వాడి సెంటర్లో కమ్యూనిటీ అవగాహన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎండి గౌషియా భాను మాట్లాడుతూ. బాల బాలికలకు ( ఆడపిల్ల 18 సం" మగపిల్ల 21సం ") నిండకుండా వివాహం చేస్తే అది బాల్య వివాహం అవుతుందని బాల్య వివాహం చేయడం వల్ల బాలికలకు శారీరక మానసిక సమస్యలు వస్తాయని , బాల్య వివాహ నిరోధక చట్టం 2006 సెక్షన్:15 ప్రకారం లక్ష రూపాయలు జరిమానా రెండు సంవత్సరాలు జైలు శిక్ష విధించే అవకాశం ఉంటుందని కనుక తమ గ్రామంలో ఎక్కడ కూడా బాల్య వివాహాలు చేసుకోకూడదని ఆమె తెలిపారు. బాలబాలికలకు (0 నుండి 18 సం" )సంబంధించి ఎటువంటి సమస్యలు ఉన్నా జిల్లా బాలల సంరక్షణ విభాగం కు సంప్రదించవలసిందిగా లేదా 1098 చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ కు సమాచారం అందించవలసినదిగా ఆమె కోరారు. పిల్లలను పెంచుకోవాలంటే చట్టపరంగా దత్తత తీసుకోవాలని ఈ దత్తతకు సంబంధించి జిల్లాలో ప్రత్యేక అడాప్షన్ ఏజెన్సీని ఉందని ఆమె తెలిపారు. ఎవరికీ అయినా పిల్లలు దత్తత కావాలంటే వారు ఈ అడాప్షన్ ఏజెన్సీని సంప్రదించవలసిందిగా ఆమె చెప్పారు ఈ కార్యక్రమంలో మార్టూరు -2 అంగన్వాడీ టీచర్,మహిళా పోలీస్ ఆశారాణి పాల్గొన్నారు.

## ఆ కార్యాలయంలో అసలేం జరుగుతోంది?

**-ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో తహసీల్దార్ తీరుపై ఆందోళన...**
**ప్రజా వేదిక అర్జీల పరిష్కారంలో ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టిస్తున్న ఎమ్మార్వో**
**మీడియా ప్రతినిధుల ప్రశ్నలకు దాటవేత ధోరణి..!**

**విశాలాంధ్ర-బుచ్చయ్యపేట:** మండలంలోని ప్రభుత్వ ఆస్తులకు రక్షణ పూర్తిగా కరువై ఆక్రమణదారుల పట్ల వరంగా మండల తహసీల్దార్ ఎం.లక్ష్మి తీరుతో ఆక్రమణదారులకు అడ్డూ అదుపే లేకుండా పోతుందన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఆస్తులను పప్పు బెల్లాలుగా చూస్తున్నారో ఏమో తెలియదు గానీ ఆక్రమణదారులపట్ల నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడంతో ప్రభుత్వ ఆస్తుల ఏమైపోతాయోనని ఆందోళన వ్యక్తం అవుతుంది.

వివరాల ప్రకారం గతంలో విశాలాంధ్ర దినపత్రికలో ప్రచురితమైన వార్తను అనుసరించి మండలంలోని పెదపూడి గ్రామపంచాయతీ పరిధిలో సర్వేనెంబర్ 52 లో గత ప్రభుత్వ హయాంలో కేటాయించిన జగనన్న స్వగృహ లేఅవుట్లలో పట్టా నెంబర్ 34 ను అదే పంచాయతీ లో పంగిడి గ్రామానికి చెందిన రాజాన రాజులమ్మ అనే మహిళకు కేటాయించారు. ఆమె తన స్వగ్రామమైన పంగిడిలో స్వస్థలంలో పక్కా ఇల్లు నిర్మించుకొని ప్రభుత్వం ద్వారా రావలసిన బిల్లుల ను పూర్తిగా పొంది ఉండ డంతో... ఆమెకు లేఅవుట్ లో కేటాయించిన పట్టా నెంబర్ 34 ను ప్రభుత్వ అధికారులు స్వాధీనం చేసుకోవాలి కానీ ఇక్కడే అసలు కథ మొదలైంది..



ఖాళీగా ఉన్న స్థలాన్ని చూసి పెదపూడి గ్రామానికి చెందిన గోకివాడ సత్తిబాబు అనే వ్యక్తి మూడు సెంట్లు (ప్రభుత్వ అధికా రులు కొలిసిన కొలతలు మేరకు) స్థలాన్ని దర్జాగా ఆక్రమించుకుని పక్కా ఇల్లు నిర్మిస్తుండడంతో గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ప్రజా వేదికలో ఫిర్యాదు చేయగా స్థానిక తహసీల్దార్ క్షేత్రస్థాయిలో విచారణ జరిపి సంబంధించిన ఇంటి నిర్మాణ పనులు నిలివివేయాలని స్థానిక వీఆర్వో, వీఆర్ఏ సమక్షంలో నోటీసులు అంటించడంతో తమ పని పూర్తయిపోయిందని అధికారులు చేతులు దులుపుకొని వదిలేయడంతో ఆక్రమణదారుడు నోటీసును చింపి నిర్మాణం కొనసాగిస్తున్నా... అధికారులు కల్లు మూసుకొని విధులు నిర్వహిస్తున్నారు.

### నోటీసులు చించిన ఆక్రమణదారుడు పై చర్యలేవి?

ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణం చేపడుతున్న ఆక్రమణదారుడు నిర్మిస్తున్న ఇంటికి ప్రభుత్వ అధికారులు అంటించిన నోటీసులను చించి యధావిధిగా పనులు పూర్తి చేసుకుంటున్నా సరే అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తూ నోటీసులు చించిన ఆక్రమణదారుడుపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం లో ఉన్న ఆంతర్యం ఏమిటో ఎవరికీ అంత పట్టడం లేదు, అక్రమ నిర్మాణం వైపు చూసి చూడకుండా విధులు నిర్వహించడం కొరకు ఏ స్థాయిలో చర్చలు జరిపారో అధికారులకే ఎరుక

### ఆక్రమణదారుడుని వెనకేసుకొస్తు, అధికారులను తప్పుదోవ పట్టిస్తూ..!

ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాలని ప్రజా వేదికలో ఫిర్యాదు చేసి నెలలు గడుస్తున్నా అక్రమ నిర్మాణం పై ఎటువంటి చర్యలు తీసుకోకపోగా ఆక్రమణదారుడికి ఎటువంటి సంబంధం లేని వేరే సామాజిక వర్గానికి చెందిన రాజాన రాజులమ్మ కు బంధుత్వం ఉందని అధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చి ప్రజావేదిక అర్జీని ముగించడంలో అత్యుత్సాహం ప్రదర్శించి ఫిర్యాదుదారుడు ఇచ్చిన ఫిర్యాదులో ప్రజా ప్రయోజనం లేదని, అధికారుల కాలాన్ని వృధా చేస్తున్నారని ఉన్నతాధికారులకు తప్పుడు రిపోర్టు ఇచ్చి వారిని తప్పుదోవ పట్టించి ఆక్రమించిన ప్రభుత్వ స్థలం ఆక్రమణదారుడి కి రాజులమ్మకు లేని బంధుత్వాన్ని సృష్టించి ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించడానికి పూర్తి సహా సహకారాలు అందిస్తూ ఆక్రమణకు అర్హత ఉంది అని చెప్పే విధంగా కూటమి ప్రభుత్వమే మూడు సెంట్లు స్థలం కేటాయించే అవకాశం ఉంది కాబట్టి దర్జాగా ఆక్రమించుకోవచ్చు అని తెలపడం వల్ల ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించడంలో స్థానిక తహసిల్దార్ విధి నిర్వహణలో ఉన్న చిత్తశుద్ధి ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. దానికి కారణం ఫిర్యాదు అందిన మొదటిలో అక్రమ నిర్మాణం పై నోటీసులు ఇచ్చిన తహసిల్దార్ నోటీసులు చించిన వారిపై ఎటువంటి చర్యలు తీసుకోకపోగా కాలాయాపన అనంతరం ఆక్రమణదారుడు కే వత్తాసు పలుకుతూ మాట్లాడడంలో ఉన్న అంతర్యం ఏ స్థాయిలో చర్చలు జరిగి చేతులు తడిచాయో అనే అనుమానాలకు బలం చేకూరుతుంది.

### సమస్యల పరిష్కారం కోసం కాళ్లు అరిగేలా తిరుగుతున్న అర్జీదారులు

తహసీల్దార్ కార్యాలయానికి ప్రజా వేదికలో ఫిర్యాదు చేసిన అర్జీదారులను పిలిపించి వారిని మీ సమస్య పరిష్కరిస్తానని మభ్యపెట్టి ప్రజా వేదికలో వారు పెట్టుకున్న ఫిర్యాదులను మూసి వేయించిన తర్వాత అర్జీదారులకు తమ సమస్యల పరిష్కారం కొరకు కాళ్ళు అరిగేలా ఆఫీసు చుట్టూ తిప్పించుకుంటున్నారని కార్యాలయంలో నిత్యం పలువురు ఫిర్యాదుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించడంలో విఫలమవుతూ మీడియా ప్రతినిధుల ప్రశ్నలను దాటవేస్తూ ఆక్రమణదారులకు కొమ్ముకాస్తున్న తహసీల్దారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని పలు ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

## భూ దోపిడీకి పాల్పడుతున్న టిడిపి నాయకులు...!

### మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ ఆరోపణలు

**విశాలాంధ్ర-మాకవారిపాలెం :** వంద కోట్లు రూపాయలు విలువచేసే నాలుగు వందల ఎకరాల ప్రభుత్వ భూమిని టిడిపి నాయకులు దోపిడీకి పాల్పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆరోపించారు. మాకవరపాలెం తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ మాట్లాడుతూ. మాకవరపాలెం మండలం రాచపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 737 కు సంబంధించిన నాలుగు వందల ఎకరాల ప్రభుత్వ భూమిని అధికార పార్టీ నియోజవర్గ స్థాయి నాయకులతో పాటు స్థానిక నాయకులు దోపిడీకి పాల్పడుతున్నారని పేర్కొన్నారు . ఈ భూ దోపిడీకి రెవెన్యూ అధికారుల సహాయ సహకారాలతో అవినీతి చర్యకు పాల్పడుతున్నారని. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తామని అన్నారు. ఈ సంఘటన గురించి కూటమి భాగస్వామి అయిన బీజేపీ పార్టీ నాయకుడు అడిగర్ల రాంబాబు అనకాపల్లి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారని ఆయన గుర్తు చేశారు. పరిశ్రమ పేరుతో నాలుగు వందల ఎకరాల ప్రభుత్వ భూమిని బినామీ రైతులతో ఆక్రమించుకుంటున్నారని తెలిపారు.ఏ పరిశ్రమకు ఇస్తున్నారనే సమాచారం అధికారులకే స్పష్టత లేకపోవడం గమనార్హమన్నారు. అధికార పార్టీ నాయకులకు రెవెన్యూ అధికారులు సహకరిస్తూ ఈ భారీ అవినీతి చర్యకు తెర లేపుతున్నారని తెలియ జేశారు. ప్రస్తుతం సాగులో ఉన్న రైతులకు కాకుండా అధికార పార్టీ నాయకులు పక్క గ్రామాల రైతులు , వారి అనుచరులు పేర్లతో రెవెన్యూ అధికారులు జాబితా తయారు చేశారని పేర్కొన్నారు. త్వరలోనే బినామీ రైతులు అలాగే ఈ స్కామ్ లో కీలక పాత్ర పోషిస్తున్న టువంటి మండలానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు, రెవెన్యూ అధికారుల పూర్తి వివరాలు కూడా తెలియపరుస్తామని మాజీ ఎమ్మెల్యే గణేష్ తెలిపారు. ఈ భూమికి సంబంధించి సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారం కోరడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్ పార్టీ జిల్లా కార్యదర్శి రుత్తల ఎర్రపాత్రుడు, మండల పార్టీ అధ్యక్షుడు చిటికెల రమణ ,ఎంపీపీ రుత్తల సర్వేశ్వరావు , మాజీ ఎంపీపీ రుత్తల సత్యనారాయణ , వాసు భద్రాచలం, బొడ్డు గోవిందు ,రాజారావు తదితర నాయకులు పాల్గొన్నారు.

## పది విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ పై అవగాహన

**విశాలాంధ్ర-నక్కపల్లి:** గొడిచెర్ల గ్రామం లోని జిల్లా పరిషత్ పాఠశాలలోని 10వ తరగతి విద్యార్థులకు ఒకేషనల్ ఎడ్యుకేషన్లో భాగంగా ఎలక్ట్రానిక్స్ %ు% ఐటి/ఐటిఈయస్ అభ్యసిస్తున్న విద్యార్థులకు ఇంటెర్న్షిప్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా డొంకాడ గ్రామంలో దొరబాబు సెల్ పాయింట్ ను మరియు దోసలపాడు గ్రామంలో కంప్యూటర్ ఇంటర్నెట్ షాప్ ను సందర్శించారు. కంప్యూటర్ ఆపరేటర్ మాట్లాడుతూ ఒకేషనల్ టెక్నికల్ కోర్సెస్ ద్వారా ఉన్నత ఉద్యోగ, ఉపాధి అవకాశాలు త్వరగా లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో వృత్తి విద్యా ఉపాధ్యాయులు యం. సాయి చందు, బి. లలిత పాల్గొన్నారు.

## నాన్ ప్రాంతాల అభివృద్ధికి అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే బండారు

**విశాలాంధ్ర-వి.మాడుగుల:** నాన్ షెడ్యూల్ ప్రాంతాలలో గల షెడ్యూల్ ప్రాంతాలను మరింత అభివృద్ధి చేయడానికి మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి నడుం బిగించారు. ఈ మేరకు సోమవారం జరిగిన శాసనసభ 4వ సమావేశంలో ఈ ప్రతిపాదనను ప్రవేశపెట్టారు. నాన్ షెడ్యూల్ ప్రాంతాలలో షెడ్యూల్ జాతులకు చెందిన జనాభా50 శాతం కంటే అధికంగా ఉన్న 496 షెడ్యూల్ గ్రామాలను సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ పరిధిలోకి చేర్చడానికి సంబంధించిన ప్రాజెక్టు అధికారులను, జిల్లా కలెక్టర్ తో కలసిఒక ప్రతిపాదనను తయారు చేశారు. సదరు ప్రతిపాదనను, పూర్తిగా పరిశీలించి ఆమోదం పొందవలసి ఉన్నది. ఈ మేరకు అనకాపల్లి జిల్లా మాడుగుల నియోజకవర్గంలో గల నాన్ షెడ్యూల్ ప్రాంతాలలో ఉన్న చీడికాడ, మాడుగుల, దేవరాపల్లి, కే.కోటపాడు మండలాల్లో ఉన్నటువంటి షెడ్యూల్ ప్రాంతాలను మరింత అధ్యయనం చేసి ఐటీడీఏ పరిధిలోకి వచ్చే విధంగా ఆమోదించి ఆయా గ్రామాల అభివృద్ధికి మరింత కృషి చేసే విధంగా అనుమతులు ఇవ్వాలని రాష్ట్ర మహిళా, సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణికి తెలియజేశామని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

## నేటి నుండి ఉపమాక వెంకన్న బ్రహ్మోత్సవాలు

**విశాలాంధ్ర -నక్కపల్లి:** ఉత్తరాంధ్ర పుణ్యక్షేత్రమైన ఉపమాక గ్రామంలో గరుడాద్రి పర్వతంపై స్వయం వ్యక్తంగా వేంచేసియున్న శ్రీ కల్కి వేంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం ముహూర్తమును అనుసరించి ఉదయం తొమ్మిదిన్నర గంటలకు ఉత్సవ కావిడితో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవములు లాంచనంగా ప్రారంభం అవుతాయని దేవస్థానం ప్రధాన అర్చకుడు గొట్టుముక్కల వరప్రసాద్ ఆచార్యులు చెప్పారు. 23వ తేదీ మంగళవారం నుండి అక్టోబర్ 2 వరకు పది రోజులు పాటు తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆధ్వర్యంలో నిర్వహించేందుకు పలు ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ మేరకు స్వామివారి ఉత్సవములకు సంబంధించి తిరుమల తిరుపతి దేవస్థానం వారి ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చలువ పందిర్లు మంచినీటి సౌకర్యం తదితర ఏర్పాట్లు పూర్తి చేశారు.

## ఉప్పొంగిన తుమ్మల గెడ్డ

### -వంతెన నిర్మించాలని ఐటీడీపీ అధ్యక్షులు నమ్మిరాజు

**విశాలాంధ్ర -బుచ్చయ్యపేట:** మండలంలోని ఆర్ శివరామ పురం వయా ఆర్ భీమవరం, కుంద్రం మీదుగా వాణిజ్య కేంద్రమైన అనకాపల్లికి ప్రయాణించే ప్రయాణికులు, వాహనదా రులకు వర్షాకాలం వస్తే ఈ మార్గం ద్వారా రాకపోకలకు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఏ మాత్రం వర్షం కురిసిన సరే ఈ రహదారిలో ఆర్ భీమవరం గ్రామానికి సమీపంలో ఉన్న తుమ్మల గెడ్డ ఉప్పొంగి ప్రవహిస్తుంటాది ఈ గెడ్డను దాటాలంటే ప్రాణాలకు తెగించాల్సి ప్రయాణాలు సాగించాల్సి వస్తుందని ఈ సమస్య ను పరిష్కరించి వంతెన నిర్మాణం జరపాలని ఆర్ శివరాంపురం గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు, మండల ఐ టి డిపి అధ్యక్షులు నమ్మిరాజు తోపాటు పలువురు ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## మాతా శిశు మరణాలపై సమీక్ష

### లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన శిక్షలు

### జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని హైమావతి

**విశాలాంధ్ర-అనకాపల్లి:** వ్యాధుల గుర్తింపు తదితర పరీక్షలకు వినియోగించవలసిన యంత్రాలను లింగ నిర్ధారణకు ఉపయోగిస్తే క్రిమినల్ కేసులు పెడతామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని ఎం. హైమావతి హెచ్చరించారు. సోమవారం జిల్లా డిఎంహెచ్ఓ కార్యాలయంలో జరిగిన మాతా శిశు మరణాలు, పి సి పి ఎన్ డి టి జిల్లా అడ్వైజరీ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.ప్రోగ్రామ్ అధికారులు స్కానింగ్ సెంటర్ లను విధిగా పరవేక్షించాలని ఆదేశించారు. నిబంధన విరుద్ధంగా వ్యవహరించే స్కానింగ్ సెంటర్లపై ప్రభుతం నిర్దేశించిన చట్టాన్నితపక్ష అమలు చేస్తామని అన్నారు.జిల్లాలో ఈ ఎడారి 1 ఏప్రిల్ నుండి జూలై 31 వరకు జరిగిన మాత్రు మరణాలు, శిశు మరణాలు, 1-5 సంవతరాల లోపు పిల్లల మరణాలు పై సమీక్షా నిర్వహించారు. సమావేశంలో డిసి హెచ్ శ్రీనివాసరావు, జిల్లా ఆసుపత్రి సూపరింట్ డెంట్ డాక్టర్ కృష్ణారావు , పిసి పి ఎన్ డి టి కమిటీ కన్వీనర్ ఆర్ చంద్రశేఖర రావు, జిల్లాలో ఉన్నప్రోగ్రాం అధికారులు, కేజీహెచ్ గైనకాలజిస్ట్, పీడియాట్రీషన్, ఎస్ ఓ. రామచంద్రరావు, పిహెచ్సి వైద్యాధికారులు, ప్రైవేట్ ఆసుపత్రుల వైద్యులు, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

## నిల్వ, పాడైన మాంస విక్రయాలపై అధికారులు విచారణ



**విశాలాంధ్ర-పాయకరావుపేట :** మండలంలోని మంగవరం గ్రామంలో నిల్వ, పాడైన మాంసం అమ్మకాలపై అధికారులు విచారణ నిర్వహించారు. గ్రామంలో ఆదివారం మటన్ కొనుగోలు చేసి వండుకొని తిన్న కొందరు వాంతులు, విరోచనాలతో స్వల్ప అస్వస్థకు గురయ్యారు. దీంతో గ్రామంలో కొనుగోలు చేసిన మాంసం తినవద్దంటూ ఒకరికొకరు సమాచారం తెలియజేసుకున్నారు. నిల్వ, పాడైన మాంసం అమ్మకాలపై గ్రామానికి చెందిన కోనే రామకృష్ణ, దేవవరపు మహేష్ పోలీసులకు, జిల్లా ఫుడ్ అండ్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఫుడ్ ఇన్స్పెక్టర్ శిరీష, పశు వైద్యాధికారి శరణ్య, పంచాయతీ కార్యదర్శి కొండారావు, వీఆర్వో రాజేష్ తదితరులు ఫిర్యాదుదారులు, గ్రామ పెద్దల సమక్షంలో విచారణ నిర్వహించారు. నిల్వ, పాడైన మాంసాలు కొనవద్దని సూచించారు. అధికారులు ధ్రువీకరించిన మాంసం మాత్రమే కొనుగోలు చేయాలని తెలిపారు. నిల్వ, పాడైన మాంసాలు అమ్మితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వంగలపూడి రామారావు, దేవవరపు రాజేష్ ఖన్నా, కోనే పుత్ర రావు, పెనుముచ్చు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ..

## చిరు వ్యాపారులకు ఉపాధి కల్పించండి : ఏఐటీయూసి

**విశాలాంధ్ర-అనకాపల్లి:** ఆపరేషన్ లంగ్స్ పేరుతో జీవీఎంసీ అధికారులు చేపట్టిన బడ్డీలు తొలగింపు. చిరు వ్యాపారం పై దాడులు ఆపాలని ఏపీ వీధి విక్రయ దారులు పెడరేషన్ ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కోన లక్ష్మణ విజ్ఞప్తి చేశారు. సోమవారం జీవీఎంసీ కార్యాలయంలో చిరు వ్యాపార సంఘాలు ఏఐటీయూసీ,సిఐటియు స్ట్రీట్ వెండింగ్ సమావేశం జరిగింది. సమావేశం జీవీఎంసీ అనకాపల్లి జోనల్ కమిషనర్ కె. చక్రవర్తి,, ట్రాఫిక్ సిఐ ఎం. వెంకట నారాయణ,, ఏపీ డి వై. సంతోష్ కుమార్, ఇతర అధికారులు పాల్గొన్నారు .ఈ సందర్భంగా లక్ష్మణ మాట్లాడుతూ. గ్రేటర్ విశాఖ నగర పరిధిలో అన్ని జూన్లో తరతరాలుగా చిన్న చిన్న వ్యాపారం చేసుకుని బ్రతుకు జీవనం సాగిస్తున్నా వారిపై జీవీఎంసీ అధికారులు సచివాలయం అధికారులు పోలీసులను దగ్గర పెట్టుకొని బెదిరించి ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా అర్ధాంతరంగా దౌర్జన్యంగా తొలగించి వీరందరి రోడ్డుమీద నెట్టడం అన్యాయం అని ఇప్పటికే జీవీఎంసీ అధికారులు చాలామందికి ఈ నగరంలో వ్యాపారం చేసుకొనుటకు గుర్తింపు కార్డులు, ట్రేడ్ లైసెన్స్, చిల్లర పన్నులు వసూలు చేస్తూ ఇప్పుడు తమకేమీ సంబంధం లేనట్టుగా వ్యవహరిస్తూ నిరుపేదలైన చిరు వ్యాపారుల పట్ల కొట్టడం ఎంతవరకు సమంజసం అని ఏఐటియుసి నేత కోన లక్ష్మణ ఆవేదన వ్యక్తం చేశారు.. ఈ వ్యాపారంగా ఉపాధిగా చేసుకుంటూ బ్రతుకుతున్న చిన్న మధ్యతరగతి కుటుంబాలు ఇప్పటికే ప్రభుత్వం ఇచ్చిన ముద్ర లోన్లు రోజువారి ఫైనాన్స్ లు కట్టుకోలేక వస్తున్న ఆదాయంతో జీవనం సాగించలేక సతమతమవుతున్న చిరు వ్యాపారుల బ్రతుకులు మరింత దుర్భార్యం గురవుతారని అధికారులు ప్రజా ప్రతినిధులు గుర్తించాలని అన్నారు. సుప్రీంకోర్టు నిబంధనలను కూడా పక్కనపెట్టి వారికి అన్ని ప్రాంతాల్లో హకరసు జోన్స్ గుర్తింపు కార్డులు,, మంచినీరు, టాయిలెట్స్ మరుగుదొడ్లు మంజూరు చేయాలని ఉన్నప్పటికీ నేటి వరకు వాటిని గాలికి వదిలేశారని, ముందస్తు సమాచారం లేకుండా తోపుడు బళ్ళు షాపులు తొలగించి ఇబ్బందులు గురి చేసే ఈ విధానాన్ని ఆపాలని ఇప్పటికే అధికారులతో అత్యుత్సాహంతో జరిపిన దాడులలో తీవ్రంగా నష్టపోయిన వర్తకులకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చిరు వ్యాపారస్తులు సంఘాల నాయకులు నాగేశ్వర రావు, బుద్ధ రాజేష్, త్రినాథ్, సయ్యద్ జైనా బ్, రాజు శ్రీనివాస్ రావు,సూర్యనారాయణ, సిఐటియు నాయుకులు శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

**విశాలాంధ్ర -పాయకరావుపేట:** మండలంలోని మాసాహెబ్ పేట గ్రామానికి చెందిన గెడ్డమూరి నాగేశ్వరరావుకు రూ.1,01,595 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును జనసేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ గెడ్డం బుజ్జి గుంటపల్లి గ్రామంలో అందజేశారు. ఈ సందర్భంగా గెడ్డం బుజ్జి మాట్లాడుతూ నాగేశ్వరరావు అనారోగ్యం దృష్ట్యా శస్త్ర చికిత్స చేయించుకుని ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. అయితే రెండు పర్యాయాలు ఫైల్ రిజెక్ట్ అయ్యిందని తెలిపారు. రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత దృష్టికి తీసుకెళ్లి సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరుకు చర్యలు తీసుకున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నామవరం పిఎసిఎస్ చైర్మన్ గెడ్డం కన్న బాబు, గెడ్డం ఆకాష్, పల్లి దుర్గారావు, సుంకర సూరిబాబు, కక్కల శ్రీను, కరెడ్ల దొరబాబు, పెంకే నాగేశ్వరరావు, లింగంపల్లి రాంబాబు, పబ్బు సూరిబాబు, గట్టెం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రారంభమైన దసరా ఉత్సవాలు



**విశాలాంధ్ర-యస్.రాయవరం:** మండలంలో దసరా ఉత్సవాలు ప్రారంభం అయ్యాయి. ఎస్. రాయవరం, ధర్మవరం, దార్లపూడి, అడ్డరోడ్డు తదితర గ్రామాల్లో దుర్గా దేవి అమ్మవారి విగ్రహాలు ఊరేగించి మండపంలో నెలకొల్పారు. అమ్మవారి ఊరేగింపుతో భవాని భక్తులు భజనలు జరిగింది.

## సీఎం చంద్రబాబును కలిసిన బుద్ద నాగ జగదీష్

**విశాలాంధ్ర-అనకాపల్లి:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ గవర్నెన్స్ సదస్సు ప్రారంభోత్సవ సమావేశానికి సోమవారం విశాఖపట్నం నేవెల్ పోస్టల్ బ్యాటరీ హెలిప్యాడ్ వద్దకు విచ్చేసిన సందర్భంగా మాజీ శాసన మండలి సభ్యులు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాక కార్యదర్శి బుద్ద నాగ జగదీశ్వరరావు చంద్ర బాబుకు నమస్కా రం చేసి మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు.

## మందుల కంపెనీలలో అక్రమ మట్టి వ్యాపారం

### - ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి

**విశాలాంధ్ర-పరవాడ:** పరవాడ ఫార్మా సిటీలో అక్రమ మట్టి వ్యాపారం జోరుగా సాగుతుంది. మందుల కంపెనీలలో సాగుతున్న మట్టి వ్యాపారం హెచ్ ఆర్ లకు సిరులు కురిపిస్తుండగా, ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతుంది. ఫార్మాసిటీ డెవలపర్ రామ్ కి పలు ఫార్మాస్ కంపెనీలకు ఎకరాలలో ప్లాట్లు కేటాయించింది. మందుల కంపెనీలు భారీగా లాభాల సిరులు పండిస్తుండడంతో విస్తరణ చేపడుతున్నారు. పరిశ్రమల విస్తరణలో కంపెనీల హెచ్ఆర్ ల చేతువాటం అటు పరిశ్రమల యాజమాన్యానికి ఇటు ప్రభుత్వానికి భారీగానే వాతలు పడుతున్నాయి. ఫైల్ ఫౌండేషన్, ఫ్యాబ్రికేషన్ వర్కులు బినామీలతో చేపడుతూ యాజమాన్యాల కనులుగప్పి కాసులు వెనకేస్తున్నారు. పరిశ్రమల విస్తరణలో మట్టిని కూడా మనీగా మార్చేస్తున్న హెచ్ ఆర్ మేనేజర్లు ఎందరో ఇక్కడ ఉన్నారు. పునాదుల్లో వేలాది క్యూబిక్ మీటర్ల గ్రావెల్ బయటపడుతుంది. ఈ గ్రావెల్ ను వేరేచోటకు తరలించాలని యాజమాన్యాలతో నమ్మబలికి అక్రమ గ్రావెల్ తరలింపు దందా మాఫియాతో హెచ్ఆర్ లు బంధం ఏర్పరచుకుంటున్నారు. ఒక్కో లారీ రూ. 3 వేల నుంచి రూ.6వేల రూపాయలు పలుకుతుంది. ఫార్మా పరిశ్రమల్లో బయటపడుతున్న మట్టిని లోతట్టు ప్రాంతాల ప్లాట్లు లెవెలింగ్ కి వినియోగిస్తూ కోట్లు కొట్టేస్తున్నారు. అయితే అక్రమ మినరల్ ట్రాన్స్పోర్ట్ను అడ్డుకోవలసిన మైనింగ్ డిపార్ట్మెంట్ పట్టించుకోవడం లేదు. విశాఖ జిల్లాలో మైనింగ్ తవ్వకాలను ప్రభుత్వం ప్రైవేటీకరణ చేసింది. దీంతో మైనింగ్ అధికారులు చేతులు ముడుచుకొని, ముద్దు నిద్ర నటిస్తూ కూర్చుంటున్నారు. ఇది కాస్త మందుల కంపెనీలలో మట్టి ఆదాయానికి వేదిక అవుతుంది. మందుల కంపెనీలలో హెచ్ఆర్ మేనేజర్ల ముసుగులో నిర్వహించే మట్టి మాఫియా దందా ప్రభుత్వ ప్రైవేట్ ఆదాయాలకు భారీగా గండి కొడుతుంది. తక్షణమే మైనింగ్ శాఖ అధికారులు పరవాడ ఫార్మసిటీలో అక్రమ మినరల్ రవాణాపై చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. గతంలో మైనింగ్ శాఖకు బకాయి ఉన్న డిఫాల్టర్లు సైతం కొండలను కొల్లగొడుతూ, పచ్చదనానికి చిచ్చు పెడుతూ మందుల కంపెనీల పేరుతో మట్టి మాఫియాగా మారి హెచ్ ఆర్ మేనేజర్లతో చేతులు కలిపి మట్టి వ్యాపారానికి తెర లేపుతున్నారు. పరవాడ ఫార్మాసిటీలో మట్టి మాఫియాకు చెక్ పెట్టాలని పలువురు కోరుతున్నారు.

**IN THE HON'BLE COURT OF THE X ADDL. DISTRICT JUDGE AT: ANAKAPALLI**
**M.O.P. 245/2025**

Between:
**Sri Addagarla Somaraju** & another ...Petitioner
And
**Sri Pasupuleti Nookaraju** & 2 others ...Respondents

**NOTICE**

To,
**R-1: Sri Pasupuleti Nookaraju,** S/o. Late Nookaraju, (Driver) Hindu, aged 37 years, R/at Kasimkota Village & Mandal, Anakapalli District.
**R-2: Teegala Gunna Mahalakshmi** W/o. T.K. Venkateswarlu, R/at H.No.10-38, Kothavalasa Village, Vizianagaram District.

Please take notice that the above named petitioners herein has filed the above M.O.P. against you for claiming compensation and the matter stands posted to **16-10-2025** for your notice & appearance. You are hereby summoned to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **16-10-2025** at **10:30 A.M** in the above Court, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.

(By Order of the Hon'ble Court)
**CH. SUSEELA DEVI**, Advocate
Visakhapatnam. **Cell: 96030 52257**

## గెడ్డం బుజ్జి ఆధ్వర్యంలో విజయదశమి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

**విశాలాంధ్ర-పాయకరావుపేట:** మండలంలోని గుంటపల్లి గ్రామంలో విజయదశమి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. జనసేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ గెడ్డం బుజ్జి దానం చేసిన స్థలంలో ఆలయం నిర్మించి 9 ఏళ్ల క్రితం కనకదుర్గ అమ్మవారి విగ్రహం ఏర్పాటు చేశారు. విజయదశమి నవరాత్రి ఉత్సవాలు పురస్కరించుకొని గెడ్డం బుజ్జి ఇంటివద్ద నుండి అమ్మవారి పంచలోహ విగ్రహాన్ని ఆలయం వద్దకు భారీ ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గెడ్డం సుజాత, నామవరం పిఏసిఎస్ చైర్మన్ గెడ్డం కన్నబాబు, భూమి కాలువ చైర్మన్ గెడ్డం చైతన్య, గెడ్డం ఆకాష్, పల్లి దుర్గారావు, కరెడ్ల దొరబాబు, సుంకర సూరిబాబు, కక్కల శ్రీను, లింగంపల్లి రాంబాబు, పెంకే నాగేశ్వరరావు, పబ్బు సూరిబాబు, గట్టెం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## దసరా శరన్నవరాత్రులలో నిత్యాన్నదానం

**విశాలాంధ్ర-చోడవరం :** మండల లోని దామునాపల్లి గ్రామంలో శ్రీ పరదేశమ్మ తల్లి దేవాలయం వద్ద దసరా శరన్నవరాత్రులు పది రోజులు నిత్య అన్నదానం ను సర్పంచ్ బలిరెడ్డి వసుంధర నాగేశ్వరరావు సోమవారం ప్రారంభించారు. శ్రీ పరదేశమ్మ దేవాలయంలో శరన్నవరాత్రులు ప్రారంభమయ్యాయి. వేకువ జామునే కలశ స్థాపన, దుర్గామాత విగ్రహ ప్రతిష్ట శ్రీసూక్త విధానాల్లో పంచామృత హరిద్ర, కుంకుమ అభిషేకాలతో జరిపించినట్లు ఆలయ అర్చకులు పారుపూడి వెంకట సత్యనారాయణ మూర్తి తెలిపారు. గ్రామంలోని భవాని దీక్షపరులే కాక ఇతరులకు కూడా అమ్మవారు అన్నప్రసాదాన్ని సంతృప్తిగా స్వీకరించినట్లు ఉత్సవ కమిటీ తెలియజేశారు. మైచర్లపాలెంలో గ్రామ దేవత శ్రీ కనకదుర్గ అమ్మవారు సన్నిధిలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రుల సందర్భంగా నిత్య అన్నదానం ను మాజీ సర్పంచ్ బూరె కనక నరసింహం (బుజ్జిబాబు) ప్రారంభించారు. వేకువజామునే అమ్మవారు కలశ స్థాపన దుర్గామాత విగ్రహ ప్రతిష్ట జరిపించి భక్తులచే సామూహికంగా పసుపు కుంకుమ అభిషేకములు నిర్వహించారు.

## దేవీపురం లో దసరా బ్రహ్మోత్సవాలు ప్రారంభం

**విశాలాంధ్ర-సబ్బవరం:** జిల్లాలో ప్రసిద్ధిగాంచిన పుణ్యక్షేత్రంగా విరజల్లుతున్న సబ్బవరం మండలం దేవిపురంలో శ్రీ సహస్రాక్షి రాజరాజేశ్వరి దేవి పీఠంలో సోమవారం ఉదయం గోమాత కు ప్రత్యేక పూజ చేసి దసరా బ్రహ్మోత్సవాలు ప్రారంభించారు. శ్రీ యంత్ర మహా మేరు ఎదురుగా ఉన్న సాధన శాలలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చండీ యంత్రం మీద ఏర్పాటు చేసిన 28 ప్రత్యేక కలశాలను పవిత్ర నదీ జలాలతో నింపి వేదమంత్రాలతో నడుమ కలశాల స్థాపన చేశారు.అటుపైన మొదటి అంతస్థు లోదక్షిణ కాళీ అమ్మవారిని ప్రత్యేకంగా ఏర్పరచిన వేదికపై అలంకరించి షోడశోపచార అష్టోత్తర పూజలు,లలితా సహస్ర నామ మరియు చండీ పారాయణాలు గావించారు. అలాగే సాయంత్రం మహా మహిమాన్విత మైన దక్షిణ కాళీ హెూమం నిర్వహించారు. అనంతరం శివానంద నృత్యమాల కు చెందిన సుమారు 10 మంది విద్యార్థినులతో కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను బాగా ఆకట్టుకున్నాయి.గురుమాత అన్నపూర్ణమ్మ భక్తులందరినీ ఆశీర్వదించి ఉచిత అన్న ప్రసాద వితరణ చేశారు. దేవిపురం నిర్వాహకులు కందర్ప ప్రభాకర్,ట్రస్ట్ కార్యదర్శి కందర్ప రామ పర్యవేక్షణలో పూజలు నిర్వహించారు.

## అంగన్వాడి కేంద్రంలో పోషణ్ పక్కాడ పై అవగాహన

**విశాలాంధ్ర-సబ్బవరం:** మండలంలోని మొగలిపురం గ్రామ పంచాయతీ బండిమాంబ గుడి దరి మొగలిపురం -2 అంగన్వాడీ కేంద్రం నందు సోమవారం 8 వ రాష్ట్రీయ పోషణ మాసోత్సవాలు - 2025 లో భాగంగా సుపోషిత్ భారత్ - సక్షం భారత్ కార్యక్రమం ద్వారా జన అందోళన్ పోషకాహార భద్రత మరియు ఆరోగ్యకరమైన జీవనశైలి పై బాలింతలకు , పిల్లలు తల్లులకు అవగాహన కార్యక్రమం మరియు 3 సం ,, లోపు పిల్లలకు ప్రేరణ తో కూడిన అభివృద్ధి చేయడం పోషణతో కూడిన విద్య పై అవగాహన నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సబ్బవరం ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ వి లలితకుమారి , సూపర్వైజర్ ఇందిరా , అంగన్వాడీ కార్యకర్త యడ్ల లక్ష్మి , పుచ్చ పైడితల్లమ్మ ,తల్లులు , పిల్లలు , బాలింతలు పాల్గొన్నారు .

## 25న కేడీపేట హైస్కూల్లో గాంధీ విగ్రహం ఆవిష్కరణ

### శ్రీ వాసవి క్లబ్ అధ్యక్షుడు చెక్క సంతోష్

**విశాలాంధ్ర-గొలుగొండ :** ఈనెల 25న గొలుగొండ మండలం కృష్ణ దేవి పేట ప్రభుత్వ జడ్పీ హైస్కూల్లో మహాత్మా గాంధీ విగ్రహం ఆవిష్కరణ చేయనున్నట్లు శ్రీ వాసవి క్లబ్ అధ్యక్షుడు చెక్కా సంతోష్ తెలిపారు. సోమవారం స్థానిక విలేకరులతో చెక్కా సంతోష్ మాట్లాడుతూ శ్రీ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టే వివిధ సేవా కార్యక్రమాలు చేయడంలో భాగంగా కృష్ణ దేవి పేట జడ్పీ హైస్కూల్లో జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించడం జరుగుతుందని తెలిపారు. ఈ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో శ్రీ వాసవి క్లబ్ ప్రతినిధులు అందరు పాల్గొంటారని తెలిపారు.

## గడ్డి మందు తాగి వ్యక్తి మృతి

**విశాలాంధ్ర-పాయకరావుపేట:** మండలంలోని సత్యవరం గ్రామానికి చెందిన ఎం. రాజేష్ (25) గడ్డి మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సీఐ జి.అప్పన్న తెలిపారు. భార్యతో గొడవపడి, పోలీస్ స్టేషన్లో కేసులు పెట్టుకుని, కౌన్సిలింగ్ లు అనంతరం మనస్థాపానికి గురైన రాజేష్ ఈనెల 6వ తేదీన గడ్డి మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చికిత్స నిమిత్తం తుని ఏరియా ఆసుపత్రికి తరలించి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

## డిప్యూటేషన్ నియామకాలలో నిబంధనల ఉల్లంఘనపై తక్షణ చర్యలు తీసుకోవాలి

### నోబుల్ టీచర్స్ అసోసియేషన్

**విశాలాంధ్ర-అనకాపల్లి:** ఈ ఏడాది మే 12న సమగ్ర శిక్ష అధికారి కార్యాలయం విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం, డిప్యూటేషన్ , ఫారిన్ సర్వీస్ పై వివిధ పోస్టుల భర్తీకి సంబంధించిన అర్హతలు, సేవా కాలం, విద్యార్హతలు, స్థానికత, వయోపరిమితులు స్పష్టంగా పేర్కొనబడ్డాయని అయితే, ఈ నియామకాల అమలులో నిబంధనలను బహిరంగంగా పక్కన పెట్టినట్లు స్పష్టమైన ఆధారాలు ఉన్నాయని తక్షణమే డిప్యూటేషన్ నియామకాల్లో జరిగిన నిబంధనల ఉల్లంఘన పై చర్యలు తీసుకోవాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు టీవీ రమణ, నక్క శ్రీనుబాబు జిల్లా విద్యాశాఖ అధికారి గిడ్డి అప్పారావు నాయుడుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. నిబంధనలలో పేర్కొన్న వయోపరిమితికి మించిన వయస్సు గల వారిని నియమించడం, అవసరమైన పిజీ. అర్హతలు లేని అభ్యర్థులను ఎంపిక చేయడం, నోటిఫికేషన్లో పేర్కొనని సహిత విద్య సమన్వయకర్త వంటి కొత్త పోస్టులను భర్తీ చేయడం, జిల్లా లో పనిచేస్తున్న స్థానిక ఉపాధ్యాయులను నియమించాలి అనే నిబంధనను ఉల్లంఘించడం ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకం మాత్రమే కాకుండా, నిజమైన అర్హులైన ఉపాధ్యాయుల దరఖాస్తులు తిరస్కారానికి గురి అయ్యాయని ఆరోపించారు. నియామక ప్రక్రియలో ఇతర అనుచిత అంశాలు ప్రభావం చూపుతున్నాయనే అనుమానాలకు తావిస్తోంది అన్నారు.వెంటనే ఈ నియామక ప్రక్రియపై సమగ్ర విచారణ జరపాలని, నిబంధనలు ఉల్లంఘించి జరిగిన నియామకాలను తక్షణమే రద్దు చేయాలని, బాధ్యులైన అధికారులపై తగిన క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని కోరారు.

## అర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్‌కు ప్రజాభిప్రాయమే కీలకం

**విశాలాంధ్ర-సక్కపల్లి:** ఈ నెలా 27న జరగబోయే అర్సెలర్ మిట్టల్ స్టీల్‌ప్లాంటు ప్రజాభిప్రాయమే కీలకమైనదని పాయకరావుపేట నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ అన్నారు. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర హెూంమంత్రి క్యాంప్ కార్యాలయం వద్ద నియోజకవర్గ కూటమి పార్టీల ముఖ్య నాయ కులతో కీలక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో వెంకటేష్ మాట్లాడుతూ ఈ నెలా 27న జరగబోయే అర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ నిర్మాణంపై ప్రజాభిప్రాయ సేకరణ నేపథ్యంలో కూటమి నాయకులుతో చర్చించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడి, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, స్థానిక శాసన సభ్యురాలు రాష్ట్ర హెూంమంత్రి వంగలపూడి అనిత సహకారంతో ఈ ప్రాంతంలో పరిశ్రమలు రావడం వల్ల ఉపాధి అవకాశాలు వస్తాయని తెలిపారు. ఈ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రజాభిప్రాయమే కీలకమని, ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణ, ఉపాధి అవకాశాలు, సామాజిక సంక్షేమ అంశాలన్నింటిని పరిగణనలోకి తీసుకుంటుందన్నారు. రానున్న రోజులలో పాయక రావుపేట నియోజకవర్గం అభివృద్ధి చెంది పెద్ద పట్నం కాబోతుందన్నారు. ఈ ప్రజాభిప్రాయ సేకరణలో స్థానిక ప్రజలు తమ బావాలను బహిరంగంగా వ్యక్తం చేయగలరని, భూములు సమస్యలు, పర్యావరణ ప్రభావం, ఉపాధి అవకాశాలు, సమాజ అభివృద్ధి అంశాలపై స్పష్టంగా తెలియజేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు మాట్లాడుతూ ప్రజాభిప్రాయ సేకరణ పూర్తి పారదర్శకంగా ఎటువంటి ఒత్తిడి లేకుండా జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాల అధ్యక్షులు చింతలపు ప్రదీప్, అమలకంటి అబద్దం, గింజాల అక్ష్మణరావు, పెట్ల లింగంనాయుడు, పాయకరావుపేట పట్టణ పార్టీ అధ్యక్షులు యాళ్ళ వరహాలబాబు, సీనియర్ టిడిపి నాయకులు యేజర్ల వినోదరాజు, కురందాసు సూకరాజు, మజ్జూరి నారాయణరావు, పల్లా విలియం కేరి, అల్లు సరసింహమూర్తి, కొప్పిశెట్టి బుజ్జి, గుర్రం రామకృష్ణ, చిక్కాల శ్రీనివాస్, జానకి శ్రీను, తదితరులు ఉన్నారు.

## అర్జీదారుల సమస్యలపై అధికారులు నిర్లక్ష్యం వహించరాదు

### క్షేత్రస్థాయిలో పర్యటించి అర్జీలు పరిష్కరించాలి

### అర్జీల సమాచారం కోసం అర్జీదారులు 1100 కాల్ చేసి తెలుసుకోవాలి

### పి.జి.ఆర్.ఎస్ కు 241 అర్జీలు కలెక్టర్ విజయ క్రిష్ణన్

**విశాలాంధ్ర-అనకాపల్లి:** ప్రజా పిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పి.జి.అర్.ఎస్.) లో వచ్చిన అర్జీలను అధికారులు వ్యక్తిగతంగా క్షేత్ర స్థాయిలో పర్యటించి అర్జీలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన పి.జి.అర్.ఎస్. కార్యక్రమంలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఎం. జాహ్నవి, డిఆర్ఓ వై.సత్యనారాయణ రావు, ప్రత్యేక ఉప కలెక్టర్ (ఏ పీ ఐ ఐ సి) అనిత లు ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుండి తీసుకున్న అర్జీల గురించి వెంటనే సంబంధిత అదికారులను వివరాలు అడిగి తెలుసుకొని, వాటి పరిష్కారానికి సత్వరమె చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అర్జీదారుల సమస్యలపై నిర్లక్ష్యం వహించరాదని అధికారులకు సూచించారు. అనంతరం పరిస్కారం కాని అర్జీల పై సమీక్ష నిర్వహిస్తూ ప్రజల నుండి వచ్చిన అర్జీలను నిర్ణిత సమయంలో పరిష్కరించాలని ఆమె తెలిపారు. ప్రజలు అందజేసిన ధరఖాస్తుల పరిష్కారానికి అర్జీదారులతో నేరుగా మాట్లాడాలన్నారు. పరిష్కరించిన వినతులను ధరఖాస్తుదారునికి తెలియ జేయాలని, పరిష్కారం కాని అర్జీల గూర్చి వారికి అందుకుగల కారణాలు వివరంగా, తెలియజేయడం ద్వారా అర్జీలు రీ ఓపెన్ కాకుండా నివారించవచ్చని తెలిపారు. పి జి ఆర్ ఎస్ అర్జీలు జిల్లా అధికారి లాగిన్ లో ఉంటే జిల్లా అధికారి మండల అధికారి లాగిన్ లో ఉంటే మండల అధికారి నేరుగా క్షేత్ర స్థాయి పర్యటనకు వెళ్లి, ప్రజల సమస్యలను క్షేత్ర స్థాయిలోనే పరిష్కరించాలని అధికారులను సూచించారు. ప్రతి శాఖ అధికారి వారి శాఖకు సంబంధించిన అర్జీల పరిష్కార పరిస్థితిని ప్రతిరోజు పర్యవేక్షణ చేసి నిర్ణిత సమయంలో చర్యలు తీసుకోవాలన్నారు, సమర్పించిన అర్జీల సమాచారం కోసం అర్జీదారులు తమ అర్జీల సమాచారం కోసం 1100 కాల్ చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్ అర్జీదారులకు సూచించారు. ఈ రోజు జరిగిన పి.జి.అర్.ఎస్.లో 241 అర్జీలు స్వీకరించడం జరిగిందని కలెక్టర్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడంలో డ్రోన్ నిఘా

### చెక్‌పోస్ట్ సిబ్బందికి అప్రమత్తం చేసిన జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా

**విశాలాంధ్ర-గొలుగొండ:** జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, ఆదేశాల మేరకు గంజాయి అక్రమ రవాణా నిరోధానికి అనకాపల్లి జిల్లా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. సోమవారం, గొలుగొండ ఎస్సై పి.రామారావు భీమవరం చెక్‌పోస్ట్ సందర్శించి సిబ్బందిని అప్రమత్తం చేశారు. గంజాయి రవాణా నిరోధక చర్యలను పర్యవేక్షించారు. ఈ సందర్భం గా చెక్‌పోస్ట్ సిబ్బందికి ప్రతి వాహనంపై సమగ్ర తనిఖీలు నిర్వహించాలని, అనుమా నాస్పద కదలికలపై నిశితంగా నిఘా పెట్టాలని సూచించారు. అదనంగా, అక్రమ రవాణా మార్గాలను గుర్తించేందుకు డ్రోన్ సర్వైలెన్స్‌ను వినియోగించాలని జిల్లా ఎస్పీ ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. జిల్లా పోలీసులు చట్టవ్యతిరేక కార్యకలాపాలను కఠినంగా అరికట్టి, ప్రజల భద్రతను కాపాడడమే తమ ప్రధాన ధ్యేయమని తెలిపారు.

## హోం మంత్రి వంగలపూడి అనిత ఆర్థిక సహాయంతో దసరా నవరాత్రి ఉత్సవాలు

**విశాలాంధ్ర-పాయకరావుపేట :** పట్టణంలోని దుర్గానగర్ లో రాష్ట్ర హెూంమంత్రి వంగలపూడి అనిత ఆర్థిక సహాయంతో దసరా నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు, ఎంపీటీసీ మల్లపురెడ్డి రమా కుమారి తెలిపారు. నవరాత్రి ఉత్సవాల ప్రారంభం సందర్భంగా దుర్గ నగర్ లో ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మ అమ్మవారి విగ్రహం వద్ద మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎన్నికల ముందు తన సొంత నిధులతో దసరా నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తానని వంగలపూడి అనిత మొక్కుకున్నారని తెలిపారు. నవరాత్రి ఉత్సవాలకు లక్ష రూపాయలు అందజేసినట్టు తెలిపారు. కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకున్న వారిలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు చింతలపు ప్రదీప్, పట్టణ అధ్యక్షులు యాళ్ల వరహాల బాబు, పెదిరెడ్డి నాగ వెంకటరమణ, పల్లా విలియం కేరి, రాజాన ఆది, బోడపాటి శ్రీను, దుర్గా నగర్ యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మాడుగులలో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

**విశాలాంధ్ర-వి.మాడుగుల:** మాడు గులలో శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం నుండి ఘనంగా ప్రారంభమయ్యాయి. వేకువజాము నుండి ఆలయ పూజారి నున్న శ్రీనివాసాచార్యులు (వాను) పూజాది కార్యక్రమాలను ప్రారంభించారు. శ్రీదేవి ఉత్సవాల ప్రారంభానికి ముందుగా శ్రీవాసవి ఇంటర్నేషనల్ జోనల్ చైర్మన్ శ్రీనాథ్ శ్రీనివాసరావు పరమేశ్వరి దంపతులు ఆయన కుమారుడు స్వరూప్, కోడలు సుజాత దంపతులచే దీక్ష, తప, హెూమ, మహన్యాస, రుద్రాభిషేక. పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా ఘనంగా నిర్వహించారు. అలాగే దసరా ఉత్సవాలు ప్రారంభమైన నేటి నుండి అనగా ఈనెల 22 నుండి వచ్చే నెల రెండవ తేదీ వరకు నిత్యం ఆలయ ప్రాంగణంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల నిర్వహణలో దసరా ఉత్సవాల కమిటీ సభ్యులు దంగేటి సూర్యారావు, అన్నంనీడి ప్రసాద్, ఇల్లపు రమణ, శ్రీనాధు వెంకట కొండలరావు, సర్పంచ్ యడ్ల కళావతి, ఉప సర్పంచ్ జవ్వాది వరహాలు ,పలువురు స్థానిక మోటార్ యూనియన్ సభ్యులు పాల్గన్నారు.

## కార్మిక వ్యతిరేక విధానాలపై చట్టం చేయడం సరికాదు

**విశాలాంధ్ర-రాంబిల్లి:** మండలంలో సిఐటియు ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అసెంబ్లీలో ఎనిమిది గంటల పని విధా నాన్ని, 10 గంటలు పని చేయించుకోవచ్చు కార్మికులతో అని, కార్మిక శాఖ అధికారుల నిర్ణయంతో 13 గంటలు పనిచేయించు కోవచ్చని, రాత్రి సమయంలో మహిళా కార్మికులతో విధులు నిర్వహించుకోవచ్చు అని అత్యంత దుర్మార్గ విధానాలను, కార్మిక వ్యతిరేక విధానాలను రాష్ట్ర అసెంబ్లీలో చట్టం చేయడం అంటే ఇంతకన్నా దుర్మార్గం మరొకటి లేదని సిఐటియు జిల్లా కార్యదర్శి జి.దేవుడు నాయుడు అన్నారు. సోమవారం నిర్వహించిన ఆందోళనా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం, 44 కార్మిక చట్టాలను రద్దుచేసి, వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్ లు తేవాలని ఇప్పటికే అనేక ప్రయత్నాలు చేస్తున్న సమయంలో, రాష్ట్రంలో అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ఇటువంటి కార్మిక వ్యతిరేక విధానాలు తేవడం అంటే కార్మికులను పరిశ్రమల యాజమాన్యాలకు కట్టు బానిసలు చేయడం తప్ప మరొకటి కాదని మండిపడ్డారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, కార్మికులకు కనీస వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు, రాము, వివిధ రంగాలకు చెందిన కార్మికులు, అప్పారావు, గంగరాజు, పెంటయ్య, నవీన్, ఆది బాబు, శ్రీను, పైడ్రాజు, చిన్న తదితరులు పాల్గొన్నారు.